అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే

- ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠకు నేటితో తెర
- కౌంటింగ్‌కు యంత్రాంగం సిద్ధం
- ఆసక్తిగా ఎదురు చూస్తున్న అభ్యర్థులు, అభిమానులు


లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్‌వో గీతాంజలి

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ అనంతరం దాదాపు 20 రోజుల టెన్షన్‌కు నేటితో తెరపడనుంది. ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. ఓట్ల లెక్కింపు మరికొద్ది గంటల్లో ప్రారంభం కానుంది. గత నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగింది. దాదాపు 20 రోజుల అనంతరం మంగళవారం ఫలితాలు తేల్చేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల లెక్కింపు జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో నిర్వహిస్తున్నారు. అభ్యర్థితో పాటు, కౌంటింగ్ ఏజెంట్లు, జనరల్ ఏజెంట్లంతా అనకాపల్లి చేరుకున్నారు. పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి 9మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన పోటీ మాత్రం వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్యనే ఉంది. వైఎస్సార్‌సీపీ తరపున రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, టీడీపీ తరపున మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పోటీలో ఉన్నారు. అభ్యర్థులు గెలుపోటములపై ఎవరికి వారే ధీమాతో ఉన్నారు. బెట్టింగ్‌లు కూడా కోట్లు, లక్షల్లోనే జరిగాయి. అందరి ఉత్కంఠకు మరికొద్ది గంటల్లో తెరపడనుంది. విజేత ఎవరో మంగళవారం మధ్యాహ్నానికి తేలిపోనుంది. కౌంటింగ్‌కు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుంది. దీనికి సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు చేసినట్టు సమాచారం. 105 మంది కౌంటింగ్ ఏజెంట్లు, ఐదుగురు చొప్పున జనరల్ ఏజెంట్లు తమ పార్టీ అభ్యర్థుల తరపున కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొననున్నారు.

పోలింగ్ సరళి ఇలా...

పాయకరావుపేట నియోజకవర్గంలో గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 82.41శాతం పోలింగ్ జరిగింది. గత ఎన్నికలతో పోలిస్తే 0.67 శాతం ఎక్కువ పోలింగ్ నమోదయింది. 2019 ఎన్నికల్లో 81.74 శాతం పోలింగ్ జరిగింది. గతంలో కంటే ఈ దఫా ఓటర్ల సంఖ్య పెరిగినప్పటికీ ఓటింగ్‌లో మాత్రం అంత ప్రభావం చూపించలేదు.

- 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి నియోజకవర్గంలో మొత్తం 2,50,744 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,23,363 మంది కాగా, మహిళలు 1,27,379 మంది ఉన్నారు. ఇతరులు ఇద్దరు ఉన్నారు. పురుషుల కంటే మహిళలే 4వేలు అధికంగా ఉన్నారు. ఈ దఫా జరిగిన ఎన్నికల్లో మొత్తం 2,06,626 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 1,02,411 మంది, మహిళలు 1,04,214 మంది ఇతరులు ఒకరు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటుహక్కు వినియోగించుకున్న వారిలో మహిళలు ఎక్కువగా ఉన్నారు. అదే విధంగా 2392 మందికి గాను 2122 మంది పోస్టల్ బ్యాలెట్‌ద్వారా తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు.

క్లుప్తంగా

28 మద్యం బాటిళ్లు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పాయకరావుపేట : పట్టణంలో సోమవారం ఉదయం అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. పట్టణానికి చెందిన గొంతిన అనిల్‌బాబు అనే వ్యక్తి గోనె సంచితో 28 మద్యం బాటిళ్లు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గమనించి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళం


మూలపేటలోని గంగాలమ్మతల్లి గుడికి విరాళం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి పలువురు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. సోమవారం ఆడారి రామకోటి –వెంకట పద్మ దంపతులు రూ.25వేలను విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, పెద్దలు ఆడారి జగన్నాథరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతికథల బోధన


మునగపాక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు

మునగపాక : నీతికథల ద్వారా విద్యార్థులకు సన్మార్గం ఉద్బోధించారు. శాఖా గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ ఆధ్వర్యంలో జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు పలు నీతి కథలను వివరించారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవి శిబిరంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర పెరిగింది. కిలోకి రూ.10 అదనంగా పెరిగింది. గత వారం కిలో రూ.40 ఉండగా, ఈ వారం రూ.50కి పెరిగింది. బంగాళాదుంప రూ.30 నుంచి రూ.40కి పెరిగింది. ఇక ఉల్లిపాయ, వంకాయ రూ.30, దొండకాయ,బెండకాయ రూ.40, బీరకాయ రూ.50, గోరు చిక్కుడు, బరబాటి, బీట్రూట్, క్యారెట్ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి. మామిడి, ఇతర పండ్ల అమ్మకాలు ఎక్కువగా సాగాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో మామిడి పండ్లు ఎక్కువగా సంతకు విక్రయానికి వచ్చాయి. బంగినపల్లి, సురేఖ వంటి ఉత్తమ రకాలతోపాటు రసాలు రకం పండ్ల అమ్మకాలు జోరుగా సాగాయి. డజన్ 200 నుంచి రూ.300 వరకు పరిమాణం,రకం అనుసరించి అమ్మకాలు సాగాయి. ఈ వారం ఆనాస పండ్లు కూడా ఎక్కువగా అమ్మకానికి వచ్చాయి. వీటిని పరిమాణం అనుసరించి ఒక్కొక్కటి రూ.50 నుంచి రూ.70కి విక్రయాలు జరిగాయి. సపోటా కిలో రూ. వందకు విక్రయించారు.

అమరజీవికి నేడు నివాళి

అనకాపల్లి : పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నామకరణ చేసి నేటికి 16 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్నట్లు శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పిరాట్ల నరసింహమూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం పలు నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఆలయాలు సందర్శించిన ఎమ్మెల్యే జోగులు


అడ్డురోడ్డులో అభయాంజనేయస్వామిని దర్శించుకున్న కంబాల జోగులు తదితరులు


పెదగుమ్ములూరులో షిరిడీసాయినాథుని దర్శించుకున్న కంబాల జోగులు తదితరులు

ఎస్.రాయవరం : ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, మండల నాయకులు అడ్డురోడ్డులో అభయాంజనేయస్వామి, షిరిడీసాయినాథుడిని సోమవారం దర్శించుకున్నారు. అనంతరం ర్యాలీగా కార్యకర్తలు, కౌంటింగ్ ఏజెంట్లతో కలిసి అనకాపల్లి చేరుకున్నారు. అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం వెలువడే ఎన్నికల ఫలితాల్లో ఘన విజయం సాధించాలని ఆలయాల్లో పూజలు నిర్వహించి అనకాపల్లి చేరుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కన్వీనర్ కొణతాల శ్రీనివాసరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ, ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనాయణరాజు, కొరుప్రోలు పీఏసీఎస్ డైరెక్టర్ గుర్రం నానాజీ, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, దూళి శ్రీనుబాబు, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా రాజు, శ్రీనురాజు, కుంచాల అప్పారావు, శ్రీను, వియ్యపు సింహాద్రి పాల్గొన్నారు.

స్వేరో నేషనల్ కన్వెన్షన్‌ను విజయవంతం చేయండి


స్వేరో ప్రతినిధులు

కోటవురట్ల: ఈ నెల 30వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే స్వేరో నేషనల్ కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల విద్యార్థి సంఘం నాయకుడు పడవల చక్రవర్తి కోరారు. కోటవురట్లలో స్వేరో సంఘ ప్రతినిధులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ స్వేరోలు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్వేరో ఉద్యమాన్ని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర కన్వీనర్ చిట్టియ్య, నాయకులు గంటేడ అప్పలరాజు, రాజుబాబు, కొండలరావు, కోటి, రాజు, సంజీవ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


తాళ్లపాలెం హైస్కూల్లో సమావేశమైన 1993-94 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూలులో 1993–94లో టెన్త్ చదివిన టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక సోమవారం జరిగింది.

ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు ఆమీర్, చల్లారావు, రమేష్, అనులను దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. వారి ఆశీస్సులు పొందారు. చివరిగా విద్యార్థులు గ్రూపు ఫోటో దిగారు.

వ్యాయామంతో ఆరోగ్యం


ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం: వ్యాయామంతో చక్కటి ఆరోగ్యాన్ని పొంది, చదువులో చురుగ్గా ఉంటారని విద్యార్థులకు విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత పి.ప్రభాకర్ సూచించారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాయామంపై శిక్షణ ఇచ్చారు. వజ్రాసనంతో పాటు పలు ఆసనాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి పి.దమయంతి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు సూచించారు.

బాలలకు చిత్రలేఖన పోటీలు


తాము వేసిన డ్రాయింగ్స్‌తో బాలలు

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో బాల బాలికలకు సోమవారం ఆటల పోటీలతో పాటు డ్రాయింగ్, కథలు, బుక్ రీడింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గత నెల 15 నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బాగా చిన్నారులకు ఆటపాటలతో పాటు పుస్తకాలు చదివించడం, నీతి కథలు చెప్పడం వంటివి చేస్తున్నారు. బాలలకు ఏయే కళలపై ఆసక్తి ఉందో తెలుసుకుని, వాటిలో తర్ఫీదు ఇస్తున్నారు. అందులో భాగంగా సోమవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వీరందరికీ జూన్ 7న ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ వరహామణి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా


తామరం జంక్షన్ వద్ద బోల్తా పడిన కారు

మాకవరపాలెం: రోడ్డు మధ్య ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి కారు బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విశాఖ నుంచి నర్సీపట్నం వైపు వస్తున్న కారు సోమవారం తెల్లవారుజామున మండలంలోని తామరం జంక్షన్ వద్దకు వచ్చేసరికి వర్షం కారణంగా అదుపుతప్పి, డివైడర్ పైకి దూసుకుపోయింది. ఆ వెంటనే కారు బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడగా కారు ఇంజిన్ భాగం దెబ్బ తింది.

పరిసరాలను శుభ్రంగా ఉంచండి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: వర్షా కాలం నేపథ్యంలో ప్రజలు ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చౌడువాడ సీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల సూచించారు. గొండుపాలెంలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య పరీక్షలను నిర్వహించారు. 139 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలను నిర్మల చేశారు. మురుగునీటి నిల్వలు ఉంటే దోమకాటు వల్ల ప్రజలు మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడే పరిస్థితి ఉంటుందని ఆమె తెలిపారు. దోమలు నిర్మూలన వల్ల మంచి ఆరోగ్యాన్ని పొందగలరని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కనకవేణి, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎంఎల్‌హెచ్‌పీ శశికళ, ఏఎన్‌ఎం కుమారి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారితో దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి వనజ

దేవరాపల్లి: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం దేవరాపల్లిలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో జరిగిన శిబిరంలో 120 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 40 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి బస్సులో తరలించారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శిబిరానికి వచ్చిన ప్రజలకు వివరించి, ఉచితంగా మందులు అందజేశారు. దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ, పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ భవానీ, శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ హరిచందన, క్యాంప్ కో ఆర్డినేటర్ అశ్వినికుమార్, నర్సింగ్ స్టాఫ్ దేవి, స్థానిక ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పాడి గేదె మృతి


మృతి చెందిన పాడి గేదె వద్ద రోదిస్తున్న యజమాని

రోలుగుంట: మండలంలోని కొవ్వూరు గ్రామంలో సోమవారం వేకువజామున పిడుగు పాటుకు మాసాడ శంకర్రావుకు చెందిన సుమారు రూ.90 వేల విలువ గల ముర్రా జాతి చూడి గేదె మృతి చెందింది. ఈ విషయాన్ని రోలుగుంట పశు వైద్యాధికారి నూకేశ్వర్రావుకు గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ తెలియజేశారు. వెంటనే ఆయన సంఘటన స్థలానికి వచ్చి, స్థానికులను విచారించారు. పోస్టుమార్టం చేసి నివేదిక తయారు చేశారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు బాధితుడిని పరామర్శించారు. ప్రభుత్వపరంగా నష్టపరిహారం వచ్చేలా చూడాలని పశువైద్యుడిని కోరారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించండి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ సత్యనారాయణ

మునగపాక : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నామని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. ఈనెల 6వ తేదీ వరకు కోడ్ అమలులో ఉంటుందన్నారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం ఆయన మునగపాక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కౌంటింగ్‌కు సంబంధించి ఏజెంట్లు, అభ్యర్థులు మాత్రమే కేంద్రాలకు చేరుకోవాలని ఇతరులు ఎవరైనా అత్యుత్సాహం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. విజయోత్సవాలు, బాణాసంచా వెలిగించడాలు చేయరాదన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలు గుంపులుగా బయట కనిపించరాదన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

ఎస్‌ఐ ప్రసాదరావు కృషి అభినందనీయం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ ప్రసాదరావు అందించిన కృషి అభినందనీయమని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ కొనియాడారు. ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా వందకు పైగా గ్రామ కూడళ్లు అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమేరాలు ఏర్పాటు చేయడంలో ఎస్‌ఐ ప్రసాదరావు పాత్ర కీలకమైందన్నారు. ఇదే పద్ధతిని ఇతర మండలాల్లో కూడా అమలు జరిగేలా చూడాలన్నారు.

మండలంలో పోలీసు పికెట్ ఏర్పాటు


పట్టణంలో హైవే జంక్షన్ వద్ద పోలీసు నిఘాను పరిశీలిస్తున్న సిఐ అప్పలరాజు

పాయకరావుపేట : ఈ నెల 4వ తేదీన మంగళవారం (నేడు) జరుగబోయే ఎన్నికల ఓట్లు లెక్కింపు కారణంగా మండలంలో భారీగా పోలీసు పికెట్ ఏర్పాటు చేయడం జరిగిందని సీఐ పి.అప్పలరాజు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 150 మంది పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో పోలీసు పికెట్ పెట్రోలింగ్ పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జనం గుంపులుగా ఉండరాదన్నారు. కౌంటింగ్ పూర్తయ్యాక ఊరేగింపులు, మందుగుండు సామాగ్రి పేల్చవద్దన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని సీఐ అప్పలరాజు తెలిపారు. మండలంలో 144 సెక్షన్ అమలులో వుందన్నారు.

కశింకోట కూడలిలో సోలార్ వెలుగులు


కశింకోట కూడలిలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ లైట్లు


సోలార్ పలకలు అమరుస్తున్న సిబ్బంది

కశింకోట : కశింకోట కూడలిలో జాతీయ రహదారి అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో రూ.24 లక్షలు ఖర్చు చేసి సోలార్ విద్యుత్ లైట్లను సోమవారం ఏర్పాటు చేసింది. కూడలిలో రెండు వైపులా చెరో పది వంతున సోలార్ పలకలు, లైట్లతో ఇప్పటికే నిర్మించిన కాంక్రీట్ దిమ్మెలకు క్రేన్ సహాయంతో వేగవంతంగా స్తంభాలు అమర్చారు. విద్యుద్దీపాలు ప్రతి రోజూ సాయంత్రం నుంచి ఉదయం వరకు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ కూడలిలో సరైన విద్యుద్దీపాలు లేక చీకటిలో దారి కానక ప్రజలు, వాహన చోదకులు రోడ్డు దాటడానికి తీవ్రంగా ఇబ్బంది పడేవారు. పలు ప్రమాదాలు కూడా చోటు చేసుకునేవి. సమస్యను పోలీసు ఉన్నతాధికారులతో పాటు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జాతీయ రహదారి అథారిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఒక్కొక్కటి రూ.లక్షా 20 వేలు ఖర్చు చేసి 20 సోలార్ విద్యుద్దీపాలు మంజూరు చేసి ఏర్పాటు చేశారు. దీంతో వెలుగులు విరజిమ్మి రాత్రి వేళ రోడ్డు దాటడానికి ఇబ్బందులు తొలగనున్నాయని స్థానికులు, వాహన చోదకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కార్మిక లోకానికి ఆదర్శం సత్యనారాయణ జీవితం


సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీహెచ్.నర్సింగరావు

అనకాపల్లి : బడుగు, బలహీన వర్గ ప్రయోజనాల కోసం దేశంలో సీఐటీయూ ఏర్పాటు చేసిన పరస సత్యనారాయణ ఆశయ సాధనకు కార్మిక లోకం కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సత్యనారాయణ శతజయంతి వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయు వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ పోరాట వీరుడు కామ్రేడ్ సత్యనారాయణ శత జయంతి వేడుకలు దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తన జీవితాంతం బడుగు బలహీన వర్గాలు, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం కృషి చేసి చిరస్థాయిగా నిలిచినట్టు తెలిపారు. నేటి కార్మిక వర్గం ఆయన స్ఫూర్తి పొందాలని వాడవాడల కార్మికుల ఐక్యం చేయడం, వారి సమస్యలపై పోరాడడం నిత్య కృత్యంగా మారాలన్నారు. నేటి సమకాలీన రాజకీయాలలో నిస్వార్థంగా పనిచేయడంతో పాటు, ప్రభుత్వాలు పెట్టే అన్ని రకాల నిర్బంధాలను, ఆటుపోట్లు తట్టుకొని నిలబడిన సత్యనారాయణ జీవితం ఆదర్శనీయమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. లోకనాథం మాట్లాడుతూ కార్మిక వర్గం సమస్యల పోరాటానికి సత్యనారాయణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ నేటి తరానికి నికార్సయిన ఆదర్శమూర్తి సత్యనారాయణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.నాగేశ్వర, జిల్లా అధ్యక్షుడు శంకరరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల రాష్ట్ర అధ్యక్షులు గూనూరు వరలక్ష్మి, వీఓఏ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎల్ శాంతి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణ


ప్రాజెక్టుకు మోటార్లను అమర్చుతున్న సిబ్బంది

మాకవరపాలెం: ఎట్టకేలకు లచ్చన్నపాలెం ప్రాజెక్టు నుంచి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. గ్రామ శివారులో ఉన్న సర్పానదిలో నిర్మించిన ప్రాజెక్టు ద్వారా సుమారు 25 గ్రామాలకు నిత్యం తాగునీరు సరఫరా అవుతోంది. ఈ నేపథ్యంలో విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగా ప్రాజెక్టుకు ఉన్న మూడు మోటార్లు కాలిపోయాయి. దీంతో గత ఆరు రోజులుగా మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయి, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు మోటార్లకు మరమ్మతులు పూర్తి కావడంతో సోమవారం సాయంత్రం నుంచి నీటి సరఫరాను పునరుద్ధరించామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివారెడ్డి తెలిపారు.